కళలను ఆదరించు RNI APTEL/2013/52784 సమాజాన్ని సేవించు

# జాబిలి

తెలుగు మాసపత్రిక

సంపుటి : 04 సంచిక : 01 పేజీలు : 36 జనవరి - 2016

వెల : 15/-



# గౌ॥ శ్రీమతి శిల్పా కాళేశ్వర్

చైర్‌పర్సన్

షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్, పెనుకొండ, అనంతపురము జిల్లా.

సాహితీ కళా సమాజ సేవలో భాగంగా నడుపుతున్న జాబిలి మాసపత్రికకు
కొత్త ఊపిరి పోసి, తెలుగుభాషా, సంస్కృతి వికాసం కోసం తమ వంతు సహకారం అందజేస్తూ
జాబిలి మాస పత్రికను నిరంతరం పాఠకుల చెంతకు చేరవేయడానికి వెన్నుదన్నుగా నిలబడి
జాబిలికి వెలుగులద్దిన దాతలందరికీ ఇవే మా
**నూతన సంవత్సర** మరియు **సంక్రాంతి** శుభాకాంక్షలు...

## మా జాబిలి కిరణాలు

### గౌ॥ శ్రీ॥ విజయభాస్కర్‌రెడ్డి
ప్రముఖ చిత్రకారులు, సమాజసేవకులు,
శివసాయి మందిరం, గ్లోబల్ ట్రస్ట్, పెనుకొండ, అనంతపురము జిల్లా.

### గౌ॥ శ్రీ॥ డా॥ రాజేష్‌కుమార్ సురేష్
ప్రతిభా డెంటల్ హాస్పిటల్, పెనుకొండ, అనంతపురము జిల్లా.

### గౌ॥ శ్రీ॥ యు. శ్రీనివాసులు
చైర్మెన్, ప్రగతి విద్యాసంస్థలు, పెనుకొండ, అనంతపురము జిల్లా.

### గౌ॥ శ్రీ॥ కె.వి. మల్లికార్జున
కరస్పాండెంట్, విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్,
సోమందేపల్లి, అనంతపురము జిల్లా.

### గౌ॥ శ్రీ యం.ఫకృద్దీన్
కరస్పాండెంట్ : విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
ఓ.డి.సి., అనంతపురము జిల్లా

### గౌ॥ శ్రీ॥ యం. సుభాష్ బాబు
అధ్యక్షులు,
ఆదరణ సేవా సంస్థ, హ్యూమన్ రైట్స్ అబ్జర్వర్స్,
సోమందేపల్లి, అనంతపురము జిల్లా.

### గౌ॥ శ్రీ॥ ఆర్.కె. పట్టెం
సామాజిక వేత్త, పెనుకొండ, అనంతపురము (జిల్లా).

### గౌ॥ శ్రీ॥ పండిత్ జాన్ ప్రియనాథ్
డిస్ట్రిక్ట్ డైరెక్టర్, హ్యూమన్ రైట్స్ అబ్జర్వర్స్, పెనుకొండ, అనంతపురము జిల్లా.

### గౌ॥ శ్రీ॥ రాజయోగిని డా॥ హేమలత సిస్టర్
ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం, పెనుకొండ, అనంతపురముజిల్లా.

### గౌ॥ శ్రీ ॥ డా॥ సి.అశోక్‌రెడ్డి & డా॥ ఎ.స్వాతి
అరవింద్ డయాబెటిక్ & డెంటల్ క్లినిక్ సెంటర్,
న్యూ హసనాబాద్ రోడ్డు, హిందూపురం, అనంతపురము జిల్లా.
సెల్ : 9849741104

### గౌ॥ శ్రీ జి.కలీముల్లా
చైర్మెన్ : మహమ్మద్ ఖమ్మృద్దీన్ అలీ గ్లోబల్ ట్రస్ట్,
పెనుకొండ, అనంతపురము జిల్లా.

### గౌ॥ శ్రీ॥ జి. శ్రీనివాసులు
మెడికల్ & హెల్త్ డిపార్ట్‌మెంట్
పావగడ.

# జాబిలి

తెలుగు మాసపత్రిక

సంపుటి : 04

సంచిక : 01 | పేజీలు : 36

జనవరి - 2016 | రూ. 15 /-


## ఈ నెల జాబిలిలో...


**సంపాదకీయం**

కాలం నది ఒడ్డున

**వ్యాసాలు**

నారీభేరి : ప్రభుత్వ విద్యా రంగంతోనే మహిళాభివృద్ధి - కె. విజయగౌరి

ఫోకస్ : హరిత జగతి సాకారం... సుదూర స్వప్నం...!- పుట్టా పెద్ద ఓబులేసు

యువలోకం : మద్యం మత్తులో యువత - జాబిలిబృందం

ఉపాధ్యాయవేదిక : దండన పాపం ఉపాధ్యాయుడిదేనా ? - గోపాలకృష్ణ

పరిశోధన : జానపద సాహిత్యం - పొడుపు కథలు - ఎం. హరినాథ్

ఈవెంట్ : అపూర్వ ఆనందాల సంగమం ప్రగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం - జాబిలి బృందం

జాబిలి కవిసమ్మేళనం : హక్కుల వెలుగులు పంచిన జాబిలి కవిసమ్మేళనం - జాబిలి బృందం

అధ్యాత్మికం : మనోబలం లేనివాడు జీవితంలో ఏమీ సాధించలేడు - డా॥ హేమలత సిస్టర్

సమీక్ష : మొదటి తరం రాయలసీమ కథలు - కొల్లూరి సోమశంకర్

మహనీయులు : నేటి గాంధీ - తెలుగుసేత : పొత్తూరు పుల్లయ్య

ఆరోగ్యం : పిల్లలలో మధుమేహం - డా॥ అశోక్ రెడ్డి

చికిత్స : దంతములు రంగు మారుట - డా॥ రాజేష్ కుమార్ సురేష్

అతిథి : స్త్రీ వాద సాహిత్య ఉద్యమ కెరటం ఓల్గా - జాబిలి

**కథ**

వీలునామ - మాధవపెద్ది ఉష

**బాలసాహిత్యం**

కోడిపిల్ల ఉపాయం - సేకరణ -ఆయేషా సమీర

అ ఆ లు దిద్దుదాము - విశ్వనాథ్

**కవితలు**

అందరూ వెళ్ళిపోతున్నారు - ఖాదర్‌షరీఫ్ షేక్

మేలుకొలుపు - గుడి మెట్ల గోపాలకృష్ణ

ప్రేమించు, జీవించు - యు.వి.రత్నం

ముఖచిత్రాలు - నమిలికొండ జగన్నాధవరావు

పుస్తకం చిరంజీవి - వల్ల భాపురం జనార్దన

అర్ధచంద్రం - కొత్త పల్లి సురేష్




# కాలం నది ఒడ్డున

ప్రతి ఉదయం తూర్పు కొమ్మపై
అరుణ పుష్పం పూసినట్టు
ప్రతి రోజు మనిషి తనకు తాను వికసించాలి
కాలం ఎవరికోసం ఆగదు
కాలంతో పాటు మనిషి పరుగెత్తాల్సిందే,
రుతువులు మారినట్టు
మనిషీ... మారాల్సిందే
వ్యక్తిగతంగాను, సామాజికంగాను
తనకు తాను ప్రతినిత్యం
జీవన సాగరాన్ని ఈదాల్సిందే
ఎన్ని ఆట పోటులు ఎదురైనా
ఎన్ని తుఫానులు చుట్టు ముట్టినా
జీవన నౌకను సరైన గమ్యంవైపు నడపక తప్పదు
గొంగలి పురుగు సీతాకోక చిలుకలా రూపాంతరం చెందినట్టు
నిన్ను నీవు రూపుదిద్దుకోవాలి.
ఆశల రెక్కలు తొడిగి ఆశయం వైపు ఎగరాలి
పగలు రేయిలా కష్ట సుఖాలు కల్లోలం చేసినా...
నిండు పున్నమి జాబిలిలా
జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి.
నలుగురికీ ఆదర్శంగా నిలవాలి
కలకాలం పలుపురి కోసం ఏదో కొంత చేసి చూపాలి
కాలం నది ఒడ్డున నీ వొక పచ్చని చెట్టై పెరగాలి.

– జాబిలి


రచయితల అభిప్రాయాలు, పత్రిక సంపాదకులతో ఏకీభవించవలసిన అవసరం లేదు.


ముఖచిత్రం : హేరామ్ - విజయభాస్కర్


సంపాదకులు : పేరూరు మల్లిక | గౌరవ సంపాదకులు : జాబిలి జయచంద్ర 'చాంద్‌బాషా' | సహ సంపాదకులు : పి.రాజశేఖర్‌రెడ్డి, డి.రామన్న

Cell : 949199 0313, 9441508510, email : jabilitelugu@gmail.com



## ప్రభుత్వ విద్యా రంగంతోనే

# మహిళాభివృద్ధి

- కె. విజయగౌరి, వ్యాసకర్త ఎపియుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

సమాజంలో సగభాగంగా ఉండే మహిళల స్థితిగతులు బాగాలేకపోతే ఆ సమాజం అభివృద్ధి చెందగలదా ? అనే చర్చ 200 సంవత్సరాల నుంచి జరుగుతున్నది. పరాయి పాలన పోయి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా మహిళ సాధికారతలో సమాజం కోరుకునే అభివృద్ధి లేదనే చెప్పాలి. 2000 సంవత్సరంలో సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు తప్పనిసరిగా సాధిస్తామని చెప్పుకున్న తీర్మానాలను 15 ఏళ్ళు గడిచాక పరిశీలిస్తే చాలా వరకు శాంతిభద్రతలు కరువయ్యాయని చెప్పక తప్పదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ మాత్రమైనా మహిళాభివృద్ధి జరిగిందంటే సామాజిక చైతన్య పోరాటాల ఫలితమే. అనేకమంది సంఘసంస్కర్తలు, అభ్యుదయ వాదులు చేసిన కృషి ఫలితంగా విద్య అందుబాటులోకి వచ్చింది. సాంఘిక దురాచారాలు, కులవ్యవస్థ, మతతత్వం వంటివి మహిళలను పట్టిపీడిస్తున్న సమస్యలపై సమరభేరి చేసి కొన్ని చట్టాలను, చైతన్యాన్ని సాధించుకున్నాం. దేశ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారత సాధించాలంటే నేటి భారత పాలకులు విధానాలు ఏ మాత్రం దోహదపడవని ఆర్థిక నిపుణులు, ఐరాస తాజాగా హెచ్చరికలు చేశాయి. దేశ సమగ్ర, సమ్మిళిత ఆర్థికాభివృద్ధిలో సముచిత స్థానం పొందాలంటే ఆదేశంలో మహిళల అక్షరాస్యత స్థాయి, లింగవివక్షత లేని మహిళా కార్మిక శక్తిని పెంచడం, ఆదాయాలను పెంచడం వల్లనే సాధ్యపడుతుందనేది వాస్తవం అయినప్పటికి నిర్లక్ష్యం కాబడుతోంది. 20 ఏళ్ల క్రితం చైనాలో 189 దేశాలు ఇవే అంశాలపై సుదీర్ఘ చర్చలు చేశాయి. ఆ తీర్మానాలకనుగుణంగా అన్ని దేశాలూ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని నిర్ణయం చేసినా వెనక్కి తిరిగి చూస్తే మన దేశంలో నేడున్న గణాంకాలు మరింత ఆందోళన కలిగించేవిగా ఉన్నాయి. ప్రధానంగా ఆడపిల్లలు అందరూ బడికి పోవాలి. లైంగిక అసమానతలు తొలగించాలి, మహిళాసాధికారత సాధించాలి. స్వేచ్ఛ, హక్కులు కల్పించాలి, హింస నుంచి విముక్తి కల్పించాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత సాధించాలి. మహిళాకార్మిక శక్తి పెంచాలి. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. ఇవన్నీ అమలు జరిగితేనే దేశాభివృద్ధి సాధ్యం. అయితే ఈ అంశాలలో మన దేశ స్థితిగతులు పరిశీలిద్దాం. 141 దేశాలలో ప్రపంచ ఆర్థిక వేదిక ఆర్థిక అవకాశాలపై రూపొందించిన నివేదికలో భారత్ 134వ స్థానంలో ఉంది. అక్షరాస్యత, లింగ వివక్షత, ఆదాయాలు పరిశీలిస్తే బాగా వెనుకబడిన 20 దేశాల్లో భారత్ ఒకటి. మహిళల్లో 68 శాతం నిరక్షరాస్యత ఉంది. 41 శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ఆడపిల్లలు బడులకు పోవాలంటే మరుగుదొడ్ల కొరత, రన్నింగ్ వాటర్, నిర్వహణ లోపాలతో రోగాల బారిన పడుతున్నారు. రక్తహీనతతో బాధపడే పిల్లలు 70 శాతం ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే వెల్లడించింది. దేశంలో రోజుకు సరాసరిన 100 హత్యలు, 364 లైంగిక వేధింపులు జరుగుతున్నట్లు జాతీయ నేర సమాచార విభాగం గణాంకాలు చెబుతున్నాయి. నానాటికీ వీటి సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. 543 మంది సభ్యులున్న పార్లమెంటులో కేవలం 66 మందే మహిళలున్నారు. 13 దేశాలు 40 శాతం పై చిలుకు ప్రాతినిధ్యం కలిగి ఉన్నాయి. విద్యకు దోహదపడే అంశాలు కోకొల్లలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగింది. దాదాపు 12.70 లక్షల పాఠశాలలో 13 కోట్లకు పైగా పిల్లలు ఈ పథకంలో పాల్గొంటున్నారు. ఇప్పుడు ఈ పథకాన్ని నిర్వీర్యం చేసి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేందుకు ఐసిడిఎస్ (శిశు అభివృద్ధి పథకం)ను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం పూనుకుంది. నిధుల కోతతో పౌష్టికాహారాన్ని అందించలేక పోవడం, బిల్లులు చెల్లించడంలో జాప్యం, వంటశాలల నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాకపోవడం వంటి వాటి ప్రభావం విద్యార్థులపై పడుతుంది. బడిపిల్లల భోజనం ఎవరి దయాధర్మం కాదు.

అది వారి చట్టబద్ధమైన హక్కు. ఇది విద్యాభివృద్ధికి దోహదపడేదిగా ఉండాలంటే సమగ్ర ప్రణాళికతో పటిష్టంగా





నిర్వహించాల్సి ఉంది. పాఠశాల ముఖం కూడా చూడని బాలలు 80 లక్షల మంది ఉన్నారని, మధ్యలో బడి మానేసేవారి సంఖ్య 8 కోట్ల వరకు ఉన్నారని యునిసెఫ్ గణాంకాలు తెలిపాయి. ప్రధాన కారణాలు ఆ కుటుంబాల సామాజిక, ఆర్థిక వెనుకబాటు అని చెప్తున్నాయి. వలసలు వెళ్లడంలో బాలికల సంఖ్యే ఎక్కువగా ఉందని, ఈ కారణంగానే మధ్యలో బడిమానేస్తున్నారని లెక్కలు చెప్తున్నాయి. ఈ వెనుకబాటు ఆడపిల్లల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, హింస, వివక్షతకు దారితీస్తుంది.



నేటి కేంద్ర ప్రభుత్వ విధానాలు కూడా పై అంశాలకు దోహదపడుతున్నాయి. ఆడపిల్లల చదువు ప్రశ్నార్థకంగానే ఉంది. వీటికి తోడు లౌకిక భావాలకు తిలోదకాలిచ్చే కరికులమ్‌లు సిలబస్‌లలో చేర్చుతున్నారు. మత ఛాందన భావాలు పెచ్చుమీరుతున్నాయి. ఫలితంగా విద్వేషాలకు బలయ్యేది మహిళలే. విద్యా చట్టంలో పేర్కొన్న వసతుల కల్పన, తాగునీరు, టాయిలెట్లు నిర్వహణకు శాశ్వత పరిష్కారాలు చూపడం లేదు. బహిర్భూమికి వెళ్లిన ఆడపిల్లలు గణనీయంగా అత్యాచారాలకు గురవుతున్నారు. నిజంగా ఇది సిగ్గుచేటు. విద్యారంగంలో పనిచేస్తున్న మహిళా టీచర్లూ ఇవే సమస్యలు ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశాలలో వేధింపులను అరికట్టేందుకు సుప్రీం తీర్పును అమలు చేయడంలేదు. ఉద్యోగ భద్రత లేక వెట్టిచాకిరీ చేస్తున్న సర్వశిక్షా అభియాన్ సిబ్బంది, కస్తూరీభా బాలికా విద్యాలయ టీచర్లను చూస్తున్నాము. ఇందులో మహిళలే గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. అంతేగాక గంటల ప్రాతిపదిక విధానం ప్రాథమిక స్థాయి నుంచి ప్రవేశపెట్టడం మరింత చాకిరీకి దారితీస్తోంది. 10వ పిఆర్‌సిలో శిశుసంరక్షణ సెలవు కోసం ప్రతిపాదనలు చేసినప్పటికి ప్రభుత్వాలు అమలుకు పూసుకోవడం లేదు.

సంస్కరణల పేరుతో నూతన విద్యా విధానం 2015 అమలుకు కేంద్ర ప్రభుత్వం పూసుకుంది. విద్యారంగంలో డిటెన్షన్ విధానం, పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పేరుతో, మీడియంలు, సిలబస్‌లలో మార్పులు వంటి వాటిని ఇందులో పొందుపరిచింది. 20 ఏళ్ళుగా విద్యారంగ సంస్కరణలు అమలు పెద్ద ఎత్తున కార్పొరేట్ శక్తుల, విద్యాసంస్థల అభివృద్ధికి దారితీశాయి. కనుకనే విద్య వ్యాపారంగా మారింది. ఇప్పటికే పేదలు విద్యకు దూరమయ్యారు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రం నూతన విద్యా విధానాన్ని అమలు చేయడమంటే గత సంస్కరణలను మరింత వేగవంతం చేయడమే. దేశంలో నిరక్షరాస్యత పెరుగుతుంది. ప్రభుత్వ విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులు శాసిస్తున్నాయి. ప్రజలు, ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో విద్య అనుబంధ కార్యక్రమాలను అప్పగిస్తారు. బాలికా విద్య కుంటుబడి సాధికారతకు దూరమవుతారు. విద్యాసంస్థలు కేంద్రీకరించబడతాయి. క్లస్టరైజేషన్‌తో బాలికల చదువు మధ్యలో ఆగిపోతుంది. అనేక మేనేజ్‌మెంట్లు బలహీనపడి మూతబడతాయి. వ్యాపారానికి అనుగుణమైన కోర్సులు ప్రవేశపెడతారు. శాశ్వత నియామకాలు ఉండకుండా పోతాయి. పెట్టుబడిదారుల, మత చాందసవాదుల ప్రయోజనాలకనుగుణంగా సిలబస్‌లలో మార్పులు వస్తాయి. దేశ సామాజిక చరిత్రలు ప్రజలకు దూరం అవుతాయి. ఇప్పటికే బాలికల ప్రత్యేక అవసరాలు తీర్చకపోవడం వంటివి శాపంగా ఉన్నాయి. ఇప్పటికే అనేక సమస్యలతో సతమతమవుతున్న భారత విద్యారంగానికి నూతన విద్యావిధానం అమలయితే ప్రభుత్వం విద్యారంగం నుంచి, సామాజిక బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకున్నట్లే. ఇటువంటి అంశాలపై ప్రధానంగా విద్యాసంస్థలలో అవసరాలు, మహిళలపై హింస, వివక్షత, విద్యా విధానాలపై చర్చలు జరుగవలసిన అవస్యకత ఎంతైనా ఉంది.



హరిత జగతి సాకారం

# సుదూర స్వప్నం ...!

**- పుట్టా. పెద్ద ఓబులేసు, సెల్ - 9550290047**

ఈ గాలి, ఈ నేల, ఈ ఊరు, సెలయేరూ...అంటూ ప్రకృతికి, మానవాళికి మధ్య ఉన్న సంబంధాన్ని రమణీయంగా వర్ణిస్తాడో సినీకవి. నేటి ఆధునికయుగంలో కూడా మానవుడు ఎన్నోరంగాల్లో ఎవరూ ఊహించనంత ఎత్తుకు ఎదిగినప్పటికీ, తన ఎదుగుదలకు మూలమైన ప్రకృతి మాతను మాత్రం ఇప్పటికీ ఏదో రూపంలో స్మరిస్తూనే ఉన్నాడు. భూమి మీద మానవుడి ఆవిర్భావం దగ్గరి నుండి ముగింపు వరకు అనుక్షణం నీడలా వెంటాడుతూ, అతడి పరిపూర్ణ అభివృద్ధిని శాసించడాన్ని కూడా ఇందుకు కారణంగా చెప్పవచ్చేమో. ఇలా ప్రాణి కోటి నంతటినీ అమ్మలా లాలిస్తూ.. కంటికి రెప్పలా కాపాడుతూ వస్తున్న ప్రకృతి.. ఇటీవల కాలంలో వరదలు, కరువులు, భూకంపాలు, సునామీల వంటి రకరకాల విశృంఖల, విపరీత విన్యాసాలతో ప్రచ్ఛన్న శత్రువుగా మారి అదే ప్రాణి కోటికి వెన్నులో వణుకు పుట్టిస్తోంది, ఎక్కడో పసిఫిక్ మహాసముద్ర ఉపరితలం మీద సంభవించే మార్పుల వల్ల ఎల్‌నినో, లానినో వంటి ఉపద్రవాలు సంభవించి వాటి ప్రభావానికి ప్రపంచ మారుమూల గ్రామాల్లోని ప్రజలు కూడా చిగురుటాకులా వణుకుతున్న వైనం అంతర్జాతీయ సమాజాన్ని ఆలోచనలో పడవేసింది. భూమి మీద ఉన్న మిగిలిన జీవజాలం కంటే మానవాళి కార్యకలాపాలే జీవవైవిధ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేవిధంగా ఉన్నాయని, పారిశ్రామిక కార్యకలాపాలవల్ల కర్బన ఉద్గారాలు పెరిగిపోయి పర్యావరణ విధ్వంసం జరగడం వల్ల భూమి వేడెక్కడమే (గ్లోబల్ వార్మింగ్) ఈ పెను మార్పులకు కారణమని శాస్త్రవేత్తలు నిర్ధారణకు వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో పుడమి తల్లి పరిరక్షణకు నడుంబిగించక పోతె రాబోయేరోజుల్లో మరిన్ని విపరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్న దూరాలోచనతో ప్రపంచంలోని వివిధ దేశాధినేతలందరూ 1992వ సం॥లో బ్రెజిల్ రాజధాని రియోడి జెనిరోలో సమావేశమై వాతావరణంలో సంభవిస్తున్న అవాంఛనీయ మార్పులను ఏవిధంగా ఎదుర్కోవాలన్న అంశం మీద సమాలోచనలు జరిపారు. కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (సీఓపీ) పేరుతో నిర్ణీత కాలవ్యవధి ననుసరించి ఏదో ఒక దేశంలో ఈ వాతావరణ శిఖరాగ్ర సదస్సులను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సం॥రం పారిస్‌లో నవంబర్ 30 నుండి డిసెంబర్ 11 వరకు 12 రోజుల పాటు 195 దేశాలకు చెందిన ప్రతినిధులతో వాతావరణ సదస్సు నిర్వహించి, ఎట్టకేలకు కర్బన ఉద్గారాలను ప్రపంచ వ్యాప్తంగా 2 శాతం కన్నా దిగువకు తగ్గించాలని ఒక చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ధరణీ మాతకు తాపాన్ని కల్గిస్తున్న గ్లోబల్ వార్మింగ్ అంటే ఏమిటి, ఈ గ్లోబల్ వార్మింగ్ తగ్గించడానికి పారిస్‌లో కుదుర్చుకున్న ఒప్పందం సవ్యంగా పట్టాల కెక్కుతుందా, లేక తీరని కల గా మిగిలిపోనుందా అన్న విషయం అంతర్జాతీయ సమాజానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

### ఉరుముతున్న పిడుగు... గ్లోబల్ వార్మింగ్

భూమి యొక్క సాధారణ ఉష్ణోగ్రత స్థాయి కంటే, అధికంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడాన్ని గ్లోబల్ వార్మింగ్‌గా వ్యవహరిస్తున్నారు. దీని వల్ల ప్రపంచవ్యాప్తంగా హిమానీనదాలు కరిగి సముద్ర నీటి మట్టాలు పెరిగిపోతాయి. సాధారణంగా భూమి ప్రతి దినం

సూర్యుని నుండి గ్రహించిన వేడిని తిరిగి వాతావరణంలోకి విడుదల చేస్తూ తన ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించుకుంటూ ఉంటుంది. అయితే భూమి మీద మానవాళి పారిశ్రామిక కార్యకలాపాలవల్ల కర్బన ఉద్గారాలు పెరిగిపోయి, ఇవన్నీ వాతావరణంలో ఒక పొరలాగా ఏర్పడి భూమి విడుదలచేసే ఉష్ణాన్ని వాతావరణంలోకి వెళ్ళకుండా అడ్డుకుంటున్నాయి. దీంతో సంవత్సరాలు గడిచే కొద్దీ భూమి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. దీనినే " గ్రీన్ హౌస్ " ఎఫెక్ట్ అని కూడా వ్యవహరిస్తారు.

మొదటసారిగా స్వీడన్‌కు చెందిన స్వాంటే అర్హీనియస్ అనే శాస్త్రవేత్త ఈ గ్లోబల్ వార్మింగ్ గురించి ప్రపంచానికి తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ దారుణమైన ఫలితాలను అనుభవించే అవకాశం ఉంది. ఇదే స్థాయిలో రాబోయే రోజుల్లో పారిశ్రామిక ఉద్గారాలు వెలువడితే పరిస్థితులు పూర్తిగా దిగజారి ప్రపంచ ఆర్థిక, సామాజిక, పర్యావరణ వ్యవస్థల్లో అల్లకల్లోలం చెలరేగే అవకాశం ఉంది. భూగోళం వేడెక్కడం వల్ల ఏర్పడే వాతావరణ మార్పుల కారణంగా వచ్చే పదిహేనళ్ళలో పంట దిగుబడులు దారుణంగా పడిపోయి, ఆహార ధాన్యాల ధరలు మరింత పెరుగుతాయని, తద్వారా మరో 10 కోట్ల మంది ప్రజలు



తీవ్ర దారిద్ర్యంలోకి జారుకునే అవకాశం ఉందని అంచనా. మధ్యదరా దేశాలతో సహా పర్యాటకానికి పెట్టింది పేరైన ప్రాంతాలన్నీ వేడితో అట్టుడికి పోతాయి. 2 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద సముద్ర మట్టాలు కనీసం 17 అంగుళాలు పెరుగుతాయని శాస్త్రవేత్తల అంచనా. దీనివల్ల ప్రస్తుతం 28 కోట్ల మంది ప్రజలు నివాసం ఉంటున్న ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉంది. క్షామాలు పెరిగి తాగు నీరు కూడా ఎండమావిగా మారిపోతుంది. 150 కోట్ల మంది నీటి ఎద్దడిలోకి వెళ్ళి పోతారని, దీంతో ఒక వైపు నీటి యుద్ధాలు, మరో వైపు ప్రబలిపోయే వ్యాధులు, పెరిగే వలసలు, కోట్ల మందిని హరిస్తాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మాల్దీవులు, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లోని ప్రజలు "పర్యావరణ శరణార్థులు "గా మారిపోయి ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రపంచమంతా విస్తరించే అవకాశం ఉంది. చాలా ఆఫ్రికా దేశాల్లో తిండి కరువు వచ్చేస్తుంది. భారత దేశ పరిస్థితి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. 2005లో ముంబైలో, తాజాగా చెన్నై నగరంలో

# అందరూ వెళ్ళిపోతున్నారు

- ఖాదర్‌షరీఫ్ షేక్, 9441938140

అందరూ వెళ్ళిపోతున్నారు
దేహపు సంచిలోని శ్వాస అయిపోయిందేమో
తనదికాని లోకమని తెల్సిపోయింది కాబోలు
మట్టిలో మనసూ, శరీరాన్ని భద్రపరచుకుని
దేహంనుంచి ఆత్మని విడగొట్టుకుని
పగలూ రాత్రిళ్ళు తేడా తెలియని రాజ్యంలోకి
దు:ఖంతో నిండిపోయిన దేహాన్ని త్యజించి
మనుషుల మధ్యనుండి విడిపోయి
మనసులు మాత్రమే మిగిలుండే ప్రపంచంలోకి
మోక్షయాత్ర ప్రారంభించుకుంటున్నారు
నిస్సహాయంగా కథని ముగించుకుంటున్నారు
అన్ని విసర్జించలేని అసహాయత కథా సముద్రానిది
కన్నీటిని పేన్చిచుట్టి తాళ్ళగా మల్చుకున్నాక
బ్రతుకు వంతెనమీద గారడీ విద్య మొదలౌతుంది
చివరాఖరికి ఇచ్ఛికంగానో, అయిష్టంగానో
జీవితపు కష్టాల కొలిమిలో దాన్ని కాల్చుకుంటూనే ఉన్నారు
అవును నిజమే అంతా అయిపోయాక
ప్రాపంచిక మర్మం తెలిసిపోయాక.. ఇక్కడేంపని
మరణాల ప్రాపంచిక ఇంటిని
ఖాళితనంతో ఉంచలేక పోతున్నాయి
శాస్వతమయినది ఏదీలేదని మరోసారి చెప్తూ
ఉందో లేదో తెలియని రెండో అధ్యాయంలోకి
అందరూ వెళ్ళిపోతున్నారు
ప్రపంచమంతా ఒక స్పష్టవిషాదరాగమని
అందరికీ ఒకేసారి అర్థమయిపోతే
ఈ దేహపు బొమ్మల గతేంకాను
ఎప్పటికీ పూర్తవని అంత్యక్రియల్ని ఎవరు చేస్తారు
కుండలు చేసిన కుమ్మరే
కుండలు బద్దలు కొట్టుకుంటాడా.. అప్పుడు
శాశ్వతం కానివన్నీ కొట్టుకుపోతాయేమో
స్మరణ శిక్షలగోల అప్పుడు ముగిసిపోతుంది
కానీ అందరూ వెళ్ళిపోతూనే ఉన్నారు.

కవిత



తలెత్తిన వరదలు, గత ఏడాది విశాఖ పట్టణాన్ని చుట్టు ముట్టిన హుద్‌దుద్ తుఫాను కోస్తా నగరాలకు పొంచి వున్న ముప్పును సూచిస్తున్నాయి. వరదలే కాదు, తరచూ కరువులూ పోటెత్తుతున్నాయి. 2002, 2009లలో తీవ్ర కరువులు సంభవించాయి. ఎంతో సురక్షితమనుకుంటున్న పెద్ద నగరాలను ప్రకృతి వైపరీత్యాలు కకావికళం చేసేస్తుండడం తాజా పరిణామంగా చెప్పుకోవచ్చు. గ్లోబల్ వార్మింగ్ వల్ల తలెత్తబోయే మరింత ప్రమాదకరమైన స్థితి ఏమిటంటే భూతాపం ఒకసారి రెండు డిగ్రీలు చేరిన తరువాత ఇక దాన్ని ఆపడం చాలా కష్టం. ఎందుకంటే ఆ స్థితిలో మొక్కలు, వృక్షాల పెరుగుదల కుంటుపడుతుంది. దీంతో మొక్కలు మన వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకోవడం మాట అటుంచి, అవే బయటకు విడుదల చెయ్యడం మొదలుపెడుతాయి. దీంతో కర్బన కాలుష్యం మరింతగా పెరుగుతుంది. ఈ విధంగా కాలుష్యం రోజు రోజుకి పెరుగుతూ మనమేం చెయ్యకపోయినా 3 డిగ్రీలకు చేరి పోవచ్చు. అందువల్ల ప్రపంచమంతా భూతాపాన్ని 1.5 డిగ్రీల దగ్గరే పరిమితం చేసేందుకు దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు కావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పారిస్ ఒప్పందం సజావుగా అమలయ్యేనా...!**

ఇలాంటి పరిస్థితుల్లో పారిస్ నగరంలో రెండు వారాల పాటు ఏకధాటిగా జరిగిన వాతావరణ శిఖరాగ్ర సదస్సు గ్లోబల్ వార్మింగ్ కట్టడికి ఒక ఒప్పందానికి రావడం ఆహ్వానించ దగ్గ పరిణామం. గతంలో ఇలాంటి సదస్సులు 20 సార్లు జరిగినప్పటికీ ఎలాంటి ఫలితం రాలేదు. కానీ పారిస్ లో నిర్వహించిన 21వ సమావేశంలో మాత్రం పాల్గొన్న 196 దేశాలు ఒక అంగీకారానికి రావడం చారిత్రాత్మక పరిణామంగా చెప్పవచ్చు.

31 పేజీలలో రూపొందిన పారిస్ ఒప్పందంలో భూతాపాన్ని నిరోధించేందుకు అనేక చర్యలను నిర్దేశించారు. భూతాప పెరుగుదలను 2 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువ స్థాయికి పరిమితం చేయాలని, దాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కే తగ్గించాలని చెబుతోంది. దీర్ఘకాలంలో అన్ని దేశాలు కర్బన ఉద్గారాల ఊసేలేని ఆర్థిక వ్యవస్థల

ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చింది. దీనిని 2050 – 2100 మధ్య కల్లా సాధించాలని నిర్దేశించింది.

అంతే కాదు దేశాలన్నిటికీ ఉమ్మడి బాధ్యతను కట్టబెడుతూనే ధనిక, పేద తారతమ్యాన్ని కూడా ఒప్పందం పరిగణలోకి తీసుకుంది. ఇలా చాలా అను కూలాంశాలు ఉన్నాయి, కాబట్టి పారిస్ ఒప్పందం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలందుకుంటోంది. అయితే ఏంచేయాలన్న విషయంలో మాత్రమే పారిస్‌లో అవగాహన కుదిరింది. ఎలాచేయాలో, అందుకు నిర్దిష్టంగా అనుసరించవలసిన కార్యాచరణ ఏమిటో స్పష్టం చేసి, దాన్ని సాధించని పక్షంలో ఎలాంటి చర్యలుంటాయో ఒప్పందం చెప్పి ఉంటే వేరుగా ఉండేది. అందువల్ల అందరికీ భరోసా ఏర్పడేది. ఒప్పందానికి చట్టబద్ధత లేకపోతె సంపన్న దేశాలు దానికి కట్టుబడి ఉంటాయని చెప్పలేము. ప్రపంచాన్ని చుట్టుముట్టిన కర్బన కాలుష్యంలో పంపన్న దేశాల వాటా 70 శాతం పైగానే ఉందని వివిధ గణాంకాలు చెబుతున్నాయి. పారిశ్రామిక విప్లవం తరువాత 1850 మొదలుకొని 2011 వరకు విడుదలైన కర్బన ఉద్గారాల్లో అమెరికా వాటా 27 శాతం, యూరోప్ దేశాల భాగం 28 అని ఆ గణాంకాల సారంశం. చైనా 11 శాతం, రష్యా 8 శాతం కాగా ఇండియా వాటా 3 శాతం కూడా మించలేదు. కర్బన ఉద్గారాలను పేద, ధనిక దేశాలన్న తేడా లేకుండా అన్ని దేశాలు కోత విధించాలని సూచించిన నేపథ్యంలో, కోత కారణంగా వర్ధమాన దేశాల్లో పరిశ్రమల స్థాపనకు వీలు కుదరని స్థితి ఏర్పడితే పేద దేశాల కోసం నిధులతో పాటు, వివిధ రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చడానికి ధనిక దేశాలు ఏంచేయబోతాయో పారిస్ ఒప్పందంలో స్పష్టతలేదు. గతంలో క్యోటో ప్రోటో కాల్‌ను అమెరికా కాలదన్నిన నేపథ్యంలో కేవలం రాజకీయ నిర్ణయాల కోసం కాకుండా, మానవాళికి ఎదుకుకాబోయే సవాళ్ళు, వాటిని ఎదుర్కొన వలసిన తీరుతెన్నుల పై శాస్త్రీయ అవగాహనతో, సంపన్న దేశాలపై ఒత్తిడి పెంచే విధంగా వర్ధమాన దేశాలన్నీ కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

చివరిగా –మాటలు లావు – చేతలు లేవు అన్నచందంగా ఉంటోంది పర్యావరణ పరిరక్షణపై అగ్ర దేశాల వైఖరి. 2020 నుండి పేద దేశాలకు హరిత నిధి కింద ఏటా 10 వేల కోట్ల డాలర్ల మొత్తాన్ని సహాయం రూపంలో అందజేస్తామని చెప్పాయి. గతంలో క్యోటో, కోపెన్ హాగెన్ సదస్సుల్లో కూడా ఇదే మాటే వల్లించినా ఆచరణలో చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. ఇప్పుడు ఎంత మాత్రం అమలు చేస్తాయో వేచిచూడాల్సి ఉంది. ఎప్పుడో 1990 వదశకం నుండే వాతావరణ పరిరక్షణ పేరిట సదస్సులు నిర్వహిస్తున్నా నేటికీ మానవ ప్రేరిత కాలుష్య ఉద్గారాల నియంత్రణ విషయంలో ఏకాభిప్రాయసాధన మృగ్యమౌతోంది. ఒక వేళ ఏదైనా అంగీకారానికి వచ్చినా సంపన్న దేశాలు తమ ద్వంద్వ వైఖరితో వాటిని ఉల్లంఘిస్తూ కాలుష్య రహిత ఆకుపచ్చని జగతి అన్న కలని ఓ సుదూర స్వప్నంగా మార్చేశాయి. ప్రకృతి మన అవసరాలు తీరుస్తుందే తప్ప, అత్యాశను కాదు అని మహాత్మా గాంధీ అన్నట్లు సంపన్న దేశాలు నేటికైనా తమ పెట్టుబడిదారీ పోకడలను, స్వార్థపూరిత విధానాలను విడనాడి బడుగు దేశాల ప్రయోజనాలకు గొడుగు పట్టే విధంగా వ్యవహరించాలి. ఏ ఒప్పందం లేకపోవడం కన్నా ఏదో ఒక ఒప్పందం ఉండడయే మంచిది కాబట్టి ప్రస్తుత పారిస్ ఒప్పందం సజావుగా అమలయ్యే విధంగా ఐక్య రాజ్య సమితి సంపన్న దేశాలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా అంతర్జాతీయంగా పౌరసమాజం కూడా కదు జాగురూకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

# మద్యం మత్తులో యువత



ఒకప్పుడు అనైతికమనుకున్నది ఇప్పుడు నాగరికతకు చిహ్నమైపోయింది. చాటు మాటుగా 'తాగే' వ్యవహారం ఇప్పుడు బహిరంగ వేడుక అయ్యింది. కొన్నేళ్లుగా.. యువతలో పెరుగుతున్న మద్యం వాడకంపై సమాజమంతా బెంబేలెత్తుతోంది. పెరుగుతున్న అశాంతి, నేరాలు, ఘోరాలకు మద్యమే ప్రధాన కారణమని మనస్తత్వ శాస్త్రవేత్తలు, సామాజిక కార్యకర్తలు అంటున్నా పట్టించుకున్న నాథుడులేడు. మద్యం కారణంగా యువత తప్పు దోవపడుతున్నది. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్న తీరుపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నది. 'మద్యం తాగి వాహనం నడిపి మరణానికి కారణమైతే.. శిక్షార్హమైన హత్యానేరం'గా పరిగణించాలని ఈ మధ్యనే సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అలాగే తాగి వాహనం నడిపితే.. నాన్ బెయిలబుల్ కేసులు నమెదు చేయడమేగాకుండా... గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష కూడా విధించవచ్చని హెచ్చరించింది. ఈ తీర్పు దేశంలో పెరిగిపోతున్న మద్యం వాడకం, దాని దుష్పరిణామాల తీవ్రతను, చెప్పకనే చెబుతోంది. 'మద్యం' వాడకం ఇవాళ దేశంలో తీవ్ర సమస్యగా మారింది. పదేళ్లుగా సమాజంలో, ప్రధానంగా యువతలో మద్యం వాడకం పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది. యువత మద్యానికి బానిసలు కావడానిక అనేక కారణాలున్నాయని అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఈ మధ్య ఇంటర్ మీడియట్‌స్థాయి విద్యార్థుల్లో మద్యం తాగేవారి సంఖ్య 45శాతానికి పెరిగింది. ఈ విధంగా ప్రతినెల అయిదారు రెట్లుగా పెరుగుతూ సమాజాన్ని కృంగదీస్తోంది. యువతలో ఈ విధంగా మద్యం వాడకం పెరగడానికి ప్రధాన కారణం.. వారిపై నానాటికి పెరిగిపోతున్న ఒత్తిడి, విచ్చలవిడిగా పాకెట్‌మని రూపంలో అందుబాటులో ఉన్న డబ్బు, కుటుంబ పర్యవేక్షణ, ఆలనా పాలనా లేకపోవడమే కారణమని సామాజిక కార్యకర్తలు చెబుతున్నారు.

ఇటీవల 'అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' (అసోచామ్) రెండువేల మంది యువతపై అధ్యయనం చేసింది. 15-19 ఏళ్ల విద్యార్థుల్లో చేసిన ఈ అధ్యయనంలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. యువతలో 32 శాతం మంది తాము నిరాశ, నిస్పృహకు గురైనప్పుడు మద్యం సేవిస్తామని చెప్పారు. 1 శాతం ఒంటరితనంతో, 15 శాతం మంది ఎటూ తోచక బోర్ కొట్టినప్పుడు తాగుతున్నామన్నారు. 46శాతం మంది సంబరాలు జరుపుకునేందుకు తాగుతామంటున్నారు. ఈ విధంగా మద్యం వాడకం ఢిల్లీ, ముంబాయి, చండీగఢ్, హైదరాబాద్ నగరాల్లో ఎక్కువగా ఉంది. పుస్తకాలకు, ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్న దానికంటే ఎక్కువగా ప్రతినెలా 3500-4500 రూపాయల దాకా మద్యానికి ఖర్చు చేస్తున్నామని విద్యార్థులు చెప్పుకొచ్చారు. ఈ విధంగా 20 ఏళ్లలోవున్న యువత మద్యానికి బానిసలుగా మారిన ఘటనలు పెరిగిపోతున్నాయి. ఒక్క ఢిల్లీలోనే రెండు వేల మంది యువత మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో వారి డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేయబడ్డాయి. ఈ ప్రమాదాన్ని మొగ్గలోనే తుంచేయకపోతే... ఇదే పెను ముప్పుగా మారే ప్రమాదం పొంచి వున్నది.

రోజు రోజుకూ పెరిగిపోతున్న పాశ్చాత్య జీవన విధానం, ఆధునిక పోకడల పేర సాగుతున్న తంతులే మద్యం వాడకానికి కారణమని నిపుణులు అంటున్నారు. అలాగే చదువుల పేరిట పెరుగుతున్న ఒత్తిడి, మానవ సంబంధాలలో వస్తున్న మార్పులు, ప్రేమ వైఫల్యాలు మద్యానికి బానిసను చేస్తూ, ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. ఈ అవాంచనీయ పోకడలు పెరిగి యువత ప్రవర్తనలో తీవ్ర మార్పులు సంభవించిన తరువాతనే కాలేజీ యజమాన్యాలు గానీ, కుటుంబాలుగానీ గుర్తించగలుగుతున్నాయి. అయితే ఈ పాటికే జరగవలసిన నష్టం జరిగిపోతున్నది. దురదృష్టవశాత్తు మద్యం తాగడం ఈ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Jabili+January+2016**

* * *